

చెలరేగిన చైన్ స్నాచర్స్

రాజంపేటలో చైన్‌స్నాచర్స్ చెలరేగిపో యారు. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే మహిళల మెడలోని గొలుసులు లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. -8లో



గురుకుల ఉపాధ్యాయుల నిరాహార దీక్ష

గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యా యులు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. తమను కాంట్రాక్టు టీచర్లుగా మార్పు చేయాలన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.100	రూ.150



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 176 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	590	610
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 389.420 కిలోలు

న్యూస్‌రీల్

ఒంటిమిట్ట రామయ్య హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం హుండీ ఆదాయం మంగళవారం టీటీడీ అధికారులు లెక్కించారు. లెక్కింపు మొత్తం పూర్తయ్యేసరికి స్వామివారి హుండీ ఆదాయం 7 లక్షల, 7 వేల, 990 రూపాయలు వచ్చినట్లు ఆలయ టీటీడీ అధికారులు వెల్లడించారు.

18 నుంచి డిపార్టుమెంట్ పరీక్షలు

రాయచోటి: ఈనెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న డిపార్టుమెంట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరీక్షలకు అన్నమయ్య జిల్లా డీఆర్‌ఓ కె.మధుసూదన్ రావు పర్యవేక్షణ అధికారిగా కొనసాగనున్నారు. జిల్లాలోని అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని డిపార్టుమెంట్లకు సంబంధించిన 1800 మంది ప్రభుత్వ ఉద్యోగులు పరీక్షలకు హాజరు కానున్నారు.

పదో తరగతి విద్యార్థుల వివరాల సవరణకు అవకాశం

రాయచోటి: పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీ తదితర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే వాటిని సరిచేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం రాయచోటిలో పత్రికలకు ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 2025 మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి గతంలో ఆన్‌లైన్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసినట్లయితే పాఠశాల రికార్డులను అనుసరించి మార్పు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు ఈ అవకాశం ఉందన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు గద్దల పవన్



రాజంపేట రూరల్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు తమ కళాశాలకు చెందిన డిగ్రీ చివరి సంవత్సరం బీకామ్ విద్యార్థి గద్దల పవన్ ఎంపికయ్యాడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తమ్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంప్‌లో ప్రస్తుతం పవన్ ఉన్నట్లు తెలిపారు. జనవరి 26వ తేదీ నిర్వహించే గణతంత్ర వేడుకల్లో పాల్గొంటాడన్నారు.


యాదవ ఎంప్లాయిస్ సొసైటీలో స్థానం



రవికుమార్ పుల్లయ్య యాదవ్ కుమార్ యాదవ్

రాయచోటి (జగదాంబసెంటర్): యాదవ్ ఎంప్లాయిస్ సొసైటీ (వైఈఎస్) రాష్ట్ర కార్యవర్గంలో అన్నమయ్య జిల్లా వాసులకు స్థానం లభించింది. గుంటూరులో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వైఈఎస్ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా కుమార్‌యాదవ్(మదనపల్లి), ఉపాధ్యక్షుడిగా పుల్లయ్యయాదవ్(రాజంపేట), సంయుక్త కార్యదర్శిగా సంక రవికుమార్‌యాదవ్(రాయచోటి)లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేంద్రబాబు, వెంకటయ్య, ట్రెజరర్ దూల్లవారిపల్లె శ్రీనివాస్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘుయాదవ్ తదితరులు వీరికి శుభాకాంక్షలు తెలిపారు.

కరుణామయుడు ఏసుప్రభువు




క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట: కరుణామయుడు, దయామయుడుగా ఏసుప్రభువు ఆరాధనలు అందుకుంటున్నాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జానీబాషాపురం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి స్వగృహంలో మంగళవారం రాత్రి సపోస్ క్రిస్మస్ వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు వాక్యాలు మనిషిని మంచి మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయన్నారు. క్రైస్తవులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని క్రైస్తవులంతా ఆశీర్వదించాలన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డి, ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత దండుమణి, వైఎస్సార్‌సీపీ నేతలు పాపినేని విశ్వనాథరెడ్డి, జీవీ సుబ్బరాజు, నవీన్, మౌలా, జాకీర్, కళ్యాణరెడ్డి పాల్గొన్నారు.

గుట్టకాయ స్వాహా!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడవు అక్రమార్కుల భూ దాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేసేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. మదనపల్లె పట్టణ శివారు ప్రాంతంలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలపై కన్నేసి అందినకాడికి దండుకుంటున్నారు. యథేచ్ఛగా కబ్జాల పర్వం కొనసాగుతున్నా నియంత్రించాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. అధికారుల అండదండలతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.





స్థలాలను ఆక్రమించేందుకు గుట్టను తవ్వి చదును చేస్తున్న జేసీబీ

- రూ.40 కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలాలు దురాక్రమణ
- 200 ప్లాట్లకు పైగా అనధికార విక్రయాలు
- విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు
- గుట్టలు చదును చేస్తున్నా పట్టించుకోని అధికారులు

మదనపల్లె: పట్టణానికి ఆనుకుని ఉన్న బీకే.పల్లె పంచాయతీలో కబ్జాల పర్వం జోరుగా కొనసాగుతోంది. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను అక్రమార్కులు ఆక్రమించుకుని, అనధికార విక్రయాలు చేసేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్లకు అలవాటుపడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మంగళవారం బీకే.పల్లె పంచాయతీలో రెవెన్యూ అధికారుల సమక్షంలో రెవెన్యూ సదస్సు జరుగుతుంటే, మరోవైపు భూ బకాసురులు సచివాలయానికి ఆనుకుని గుట్టలను యథేచ్ఛగా జేసీబీలతో చదునుచేస్తూ ఆక్రమణలకు పాల్పడ్డారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో, ఆక్రమణలకు అధికారులే అండదండలు అందిస్తున్నట్లు స్థానికులు వాపోయారు.

- బీకే.పల్లె పంచాయతీ అనంతపురం-కృష్ణగిరి జాతీయ రహదారికి ఆనుకుని గుట్ట ప్రాంతాల్లో ఉండటం అక్రమార్కులకు బాగా కలిసివచ్చింది. 2005-06లో సర్వే నంబర్.548, 440 పార్ట్‌లో 291 ప్లాట్లను ఇందిరమ్మ కాలనీకి కేటాయిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో లేఅవుట్ వేశారు. ఈ సర్వే నంబర్లకు ఆనుకుని పది ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. అప్పట్లో ఊరికి ఈ స్థలం కొంత దూరంగా ఉండటంతో చాలామంది పట్టాలు తీసుకున్నప్పటికీ ఇళ్లు నిర్మించుకోలేదు. కొందరు పునాదులు వేసుకుని ఆపేస్తే, మరికొందరు అలాగే వదిలేశారు. పట్టణ జనాభా రోజురోజుకీ విస్తరిస్తుండటం, భూముల విలువలు అమాంతం ఆకాశానికి చేరడంతో మధ్యతరగతి ప్రజల దృష్టి శివారు ప్రాంతాల భూములపై పడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న దళారులు బీకే.పల్లె పంచాయతీలో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి, వాటికి దొంగ పట్టాలు సృష్టించి తమ ఆధీనంలో ఉన్నాయని అమాయకులను నమ్మించడం మొదలుపెట్టారు. నీరుగట్టువారిపల్లెలో చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందడంతో అనంతపురం, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల నుంచి పలువురు బతుకుతెరువు కోసం మదనపల్లెకు వచ్చి, ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకునేందుకు ఆసక్తి చూపారు. బీకే.పల్లెలో గుంట స్థలం ఉన్న ప్లాట్లు రూ.4 నుంచి 6 లక్షలకు దళారులు విక్రయించారు. ఖాళీ స్థలాలన్నీ అమ్ముడైపోవడంతో దళారుల కన్ను గుట్టలపై పడింది. రెవెన్యూ అధికారుల సహకారంతో గుట్టలను చదును చేస్తూ, ఏర్పడిన ఖాళీ స్థలాలకు అధికారుల ముందరే బేరం కుదుర్చుకుని, ఇళ్లు నిర్మించి, కరెంటు కనెక్షన్ వచ్చేంతవరకు తమదే బాధ్యత అన్నట్లుగా అన్నీ చూసుకుంటున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. బీకే.పల్లె పంచాయతీలో ప్రభుత్వ స్థలాల కబ్జాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఉక్కుపాదం మోపి అన్నింటినీ తీసివేయించారు. అనర్హులను ఏరిపారేశారు. దీంతో దళారులు తోకముడిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి దళారులు విజృంభించడం మొదలుపెట్టారు. కోట్లు విలువైన ప్రభుత్వస్థలాలు కబ్జాలకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



ఇది ప్రభుత్వ స్థలం అంటూ రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేసినా ఆగని ఆక్రమణలు



బీకే.పల్లె పంచాయతీ ప్రభుత్వ స్థలాల్లో జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు

డీఈఓ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కడప మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలు, ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎస్‌జీటీ, తత్సమాన కేటగిరీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను www.kadapadeo.in వెబ్‌సైట్‌నందు పొందుపరిచామని డీఈఓ మీనాక్షి తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తగిన ఆధారాలు, సర్వీసు రిజిస్టర్‌తో స్వయంగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని ఆమె తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సంబేపల్లె రెవెన్యూ సదస్సులో మంత్రి రాంప్రసాద్ రెడ్డి

సంబేపల్లె: మండల పరిధిలోని గుట్టపల్లె, శెట్టిపల్లె గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ భూమి - మీ హక్కు రెవెన్యూ సదుస్సులు ఈ నెల 6నుంచి జనవరి 8వరకు నిర్వహిస్తామన్నారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అనంతరం భూ సమస్యలపై వచ్చిన అర్జీలను మంత్రి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, రవీంద్రారెడ్డి, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

వైవీయూలో అకడమిక్ ఆడిట్



వైవీయూలో విభాగాలను పరిశీలిస్తున్న ఐఎస్‌ఓ ప్రతినిధులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ ప్రతినిధుల బృందం సందర్శించింది. తొలుత ప్రతినిధుల బృందం హెచ్.వై.ఎం. ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య, ఆడిటర్ టి.సుమాదేవి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఐక్యూఏసీ సంచాలకులు డా. ఎల్. సుబ్రహ్మణ్యం శర్మ, డిప్యూటీ డైరక్టర్ ఎం. సుభోష్ చంద్ర, గ్రీన్ అండ్ ఎనర్జీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ బ్లాక్, సైన్స్ బ్లాక్, గురుకులం భవనాలలోని డిపార్ట్‌మెంట్‌లను పరిశీలించారు. శాఖలలో జరుగుతున్న ప్రగతిని ప్రత్యక్షంగా గమనించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల ప్రయోజనార్థం పనిచేస్తున్న పలు విభాగాలు వాటి పనితీరును మదింపు చేశారు. బుధవారం కూడా విశ్వవిద్యాలయంలో పరిశీలన ఉంటుందని ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్.వై.ఎం. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రతిష్టాత్మక మైందని, అత్యున్నతస్థాయి విశ్వవిద్యాలయానికి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మరో రెండు ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: అయ్యప్ప భక్తుల కోసం మరో రెండు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. విజయవాడ- కొల్లంల మధ్య డిసెంబర్ నెలంతా ప్రత్యేక రైలు నడుస్తుందన్నారు. 07177 నెంబర్ గల రైలు డిసెంబర్ 21, 28 తేదీల్లో శనివారం రాత్రి 10.15 గంటలకు విజయవాడలో బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు చేరుకుని సోమవారం ఉదయం 6.20 గంటలకు కొల్లాంకు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో (రైలు నెంబర్ 07178) డిసెంబర్ 23, 30 తేదీల్లో సోమవారం ఉదయం 10.45 గంటలకు బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 5.40 గంటలకు చేరుకుని కాకినాడకు ఆరోజు రాత్రి 9 గంటలకు రైలు చేరుతుందన్నారు. అలాగే మరో రైలు నరసాపూర్-కొల్లంల మధ్య నడుస్తుందన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

సిద్దవటం: సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాజంపేట ఎమ్మెల్యే , వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి విమర్శించారు. సిద్దవటం మండంలోని టక్కోలు పంచాయతీ డేనగవాండ్లపల్లి గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారన్నారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం అంటూ తల్లికి పంగనామాలు పెట్టారన్నారు. ప్రజలపై మరింత భారాన్ని మోపుతూ విద్యుత్ చార్జీలను పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు సౌమిత్రి, సిద్దవటం మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, మండల పార్టీ అధికార ప్రతినిధి ఉపాసి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులు.. నీళ్లు నములుతున్నారు!

- రైళ్లకు నందలూరులో నీటి సౌకర్యం కల్పించే ప్రతిపాదన పెండింగ్‌లోనే..
- అప్పట్లో రూ.34 లక్షలకుపైగా వ్యయంతో అంచనాలు
- నందలూరు నీళ్ల ప్రాముఖ్యతను విస్మరిస్తున్న రైల్వే శాఖ
- రైల్వే అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



రైళ్లకు వాటరింగ్ (నమూనా చిత్రం)



నందలూరు రైల్వే కేంద్రం

రాజంపేట: గుత్తి-రేణిగుంట రైలుమార్గంలోని వివిధ రైళ్లకు నందలూరు స్టేషన్‌లో నీటి సౌకర్యం కల్పించాలనే ప్రతిపాదన పట్టాలెక్కలేదు. రైళ్లకు నందలూరులో నీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పనులకు రూ.34లక్షలకుపైగా వ్యయం అవుతుందని అంచనాలను రూపొందించినట్లు రైల్వే వర్గాల ద్వారా తెలిసింది. అయితే కరోనా మహమ్మారి నేపథ్యంలో అప్పట్లో ఈ ప్రతిపాదనను రైల్వే శాఖ అటకెక్కించింది. కరోనా మహమ్మారి ప్రభావం ముగిసి ఐదేళ్లయినా ఈ ప్రతిపాదనను అమలు చేయాలన్న దిశగా రైల్వే ఉన్నతాధికారులు ఆలోచించడం లేదు. అక్టోబరు 4న విజయవాడలో జరిగిన రైల్వే అధికారుల సమావేశంలో రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిలు నందలూరురైల్వేకు పూర్వవైభవం కల్పించే అంశాలను ప్రస్తావించారు.

నందలూరు నీళ్ల ప్రాముఖ్యత..

దక్షిణ మధ్య రైల్వేలో గుంతకల్లు డివిజన్‌లో నందలూరు నీళ్లకున్న ప్రాముఖ్యత అందరికీ తెలిసిందే. ఇటీవల ఇదే అంశంపై ఢిల్లీలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్‌ను నందలూరు ఐకేపీఎస్ నేతలు కలిసిన సందర్భంలో ఆయన కూడా నందలూరు నీళ్ల ప్రాముఖ్యతను గుర్తు చేశారు. నందలూరు నీటితోనే రైల్వే పుట్టుక ఆరంభమైంది. 1864లో బ్రిటీషర్లు నందలూరులో నీటి లభ్యతను ఆధారం చేసుకొని స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ నిర్మించారు. ఈ నీటి వల్ల నీటి ఆవిరికి సంబంధించిన పింగాణీ తుప్పు పట్టకుండా ఉంటుందని అప్పట్లోనే బ్రిటీషు రైల్వే పాలకులు నీటి నాణ్యతపై పరిశోధనలు చేశారు. రైల్వేకేంద్రానికి అవసరమైన నీటి కోసం యేటి నొడ్డున బావిని తవ్వించారు.

నీటి కోసం 'తిరుమల' పరుగులు..

విశాఖ -తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు నీటి కోసం కడప నుంచి కొండాపురం వరకు పరుగులు తీయకతప్పడంలేదు. ఫలితంగా రైల్వే వ్యయం వృథా అవుతోంది. అనవసర ఖర్చులు, భారం రైల్వేపై పడుతోందని రైల్వే వర్గాలు అంటున్నాయి. కేవలం రైల్వే అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల పరోక్షంగా నష్టం కలుగుతోందన్న విమర్శలు రైల్వేవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఈ మార్గంలో నడిచే రైళ్లకు నీళ్లు పట్టుకునేందుకు నందలూరు అనుకూలమని ఇప్పటి డివిజన్ ఉన్నతాధికారులకు తెలుసు. కడప నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నందలూరులో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు వాటరింగ్, క్లీనింగ్ పెట్టుకోకుండా కడప నుంచి 90 కిలోమీటర్ల దూరంలోని కొండాపురం తీసుకెళ్లి, మళ్లీ కడపకు తీసుకొచ్చి నడిపించడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని కార్మిక సంఘాలు పెదవి విరుస్తున్నాయి.

రేణిగుంట, తిరుపతి రైల్వేస్టేషన్లపై భారం తగ్గుతుంది..

ఇటీవల ముంబయి-చెన్నై మధ్య నడిచే రైళ్లలో లెట్రిన్‌లో, వాష్‌బేసిన్‌లో నీళ్లు రావడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి అన్ని రైళ్లలో దాదాపుగా ఉంది. నందలూరులో వాటరింగ్ ఏర్పాటుతో రేణిగుంట, తిరుపతి రైల్వేస్టేషన్లలో కొన్ని రైళ్లకైనా భారం తగ్గుతుంది. ఫలితంగా లైన్ల రద్దీ తగ్గుతుంది. గుత్తి-రేణిగుంట మార్గంలో నడిచే రైళ్లన్నింటికి నందలూరులో నీటిని నింపుకునేందుకు పుష్కలంగా వనరులు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు రైల్వేశాఖకు మంచి అవకాశం ఉంది. వాటరింగ్‌కు అనుకూలంగా నందలూరులో ఏడులైన్లు ఉన్నాయి.

పూ్యరిఫైడ్ నీళ్లుగా గుర్తింపు

తెల్లదొరలు నందలూరు నీటిని ప్యూరిఫైడ్ నీటిగా గుర్తించారు. అందువల్లనే వారు నందలూరుకు రైల్వేపరంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. నందలూరు నీటిలో పొటాషియం, కాల్షియంతోపాటు ఖనిజ లవణాలు పుష్కలంగా ఉన్నాయి. టీడీఎస్ 188 పాయింట్లు చూపిస్తోంది. అదే కంపెనీ వాటర్ బాటిళ్లలో 25 నుంచి 35 పాయింట్లు చూపిస్తోంది. అంటే మినరల్ వాటర్ కూడా నందలూరు నీళ్లకన్నా నాణ్యతలో తక్కువేనని పేర్కొంటున్నారు.

నందలూరు నుంచే వాటర్ ట్యాంకర్ రైళ్లు నడిచాయి..

స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ కొనసాగిన సమయంలో నందలూరు నుంచే వాటర్ ట్యాంకర్ రైళ్లు నడిచాయి. గుంతకల్ డివిజన్ ఉన్నతాధికారులు ప్యాసింజర్ రైళ్ల బ్రేక్‌లలో నీటి క్యాన్‌లతో సరఫరా జరిగేది. 1977లో గుంతకల్లు డివిజన్ సదరన్ రైల్వే నుంచి విడిపోయి దక్షిణ మధ్య రైల్వేలో విలీనం అయినప్పటికీ ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఉద్యోగులు ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారంటే నీళ్లే కారణంగా చెబుతున్నారు.



నందలూరు నీళ్లతో నడిచిన ఒకప్పటి స్టీమ్ రైలింజన్

నందలూరు నీళ్లకున్న ప్రాముఖ్యతను రైల్వే గుర్తించాలి



నందలూరు నీళ్లకున్న ప్రాముఖ్యతను రైల్వే యాజమాన్యం ఇప్పటికైనా గుర్తించాలి. నందలూరు నీళ్లు ఒక్కసారి తాగితే ఈ ప్రాంతాన్ని మరువలేరు. రైళ్లలో ప్రయాణించే వారు నందలూరు వస్తుందంటే నీళ్లు పట్టుకోవాలనే వారు. అది నందలూరు నీళ్లకున్న గుర్తింపు.

- గానుగపెంట హనుమంతరావు, సాహితీవేత్త

రైళ్లలో నీటి సమస్య తీరుతుంది



ఇప్పుడు ఈ మార్గంలో నడిచే ఏ రైలులో అయినా నీటి సమస్య తీవ్రంగా ఉంది. నందలూరు రైల్వే కేంద్రంలో వాటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే రైళ్లలో నీటి సమస్య తీరుతుంది. అంతేగాకుండా రేణిగుంటలో రైళ్లకు నీళ్లు పట్టాల్సిన అవసరం ఉండదు. కొన్ని రైళ్లకు నందలూరులో నీటిని నింపుకోవచ్చు.

-ఫైజుల్లాఖాన్ లోడి, లోక్ అదాలత్ సభ్యుడు

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

మదనపల్లె : ఓ వ్యక్తిపై జరిగిన దాడి ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కాగా, మంగళవారం డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన జయభారత్‌పై ఈ నెల7న పట్టణానికి చెందిన రెడ్డిశేఖర్, మధుబాబు, మునీంద్రనాయక్‌లు బెంగళూరు రోడ్డులో దాడికి పాల్పడ్డారు. వీరి మధ్య ఓ భూమికి సంబంధించి క్రయ, విక్రయాల్లో భాగంగా జయభారత్ కొంత నగదు వీరికి బాకీ పడ్డాడు. నగదు సకాలంలో చెల్లించకపోవడంతో వారు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడు ఈనెల 13న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ శివకుమార్ దాడి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా డీఎస్పీ బెంగళూరు రోడ్డులో ఘటన జరిగిన ప్రాంతంలో చుట్టుపక్కల వారిని విచారణ చేశారు.

కోడిపందెం ఆటగాళ్ల అరెస్ట్

మదనపల్లె : కోడి పందెం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ వద్ద కోడి పందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,840, రెండు పందెంకోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

సిద్దవటం : మండల పరిధి టక్కోలు గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను కడపకు తరలిస్తున్న 10 ట్రాక్టర్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత తెలిపారు. ఆ ట్రాక్టర్లను స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు– శెట్టిగుంట జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం చెందాడు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో చదువుతున్న అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గం నల్లమల్ల తండాకు చెందిన మహేంద్ర నాయక్ (21) బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. మృతుడి తల్లిదండ్రులు తులసీధర్ నాయక్, తిరుపాల్ భాయిలకు విషయం తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెలరేగిన చైన్‌స్నాచర్స్

- ఒకే రోజు రెండు చోట్ల యత్నం
- స్థానికులు అడ్డుకోవడంతో విఫలం





బోయనపల్లెలో చైన్‌స్నాచర్ సీసీటీవీ ఫుటేజీ



మహిళ బంగారు గొలుసు

రాజంపేట : రాజంపేటలో చైన్‌స్నాచర్స్ చెలరేగిపోయారు. పట్టణంలోని పలు దారుల్లో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే మహిళలనే టార్గెట్ చేసుకున్నారు. మంగళవారం ఆర్‌ఎస్ రోడ్డులోని ఓ ప్రైవేట్‌చిట్స్ కంపెనీలో పని చేస్తున్న మహిళ నూనివారిపల్లె నుంచి తన కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. రాఘవేంద్రస్టోర్ వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఆమె గొలుసును గట్టిగా పట్టుకున్నారు. తెగి మెడకు గాయమైంది. దీంతో ఆ ప్రాంత మహిళలు చైన్‌స్నాచర్స్ గతంలో ఓమారు రెచ్చిపోయిన సంఘటనలు గుర్తుచేసుకున్నారు. పట్టణపగలే రోడ్డపై మహిళలు తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. అలాగే బోయనపల్లె (రాజంపేట రూరల్ ఏరియా)లో కూడా చైన్‌స్నాచర్స్ హల్‌చల్ చేశారు. పలువురు మహిళల గొలుసులు అపహరించేందుకు యత్నం చేశారు. స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నిం చేయడంతో వారు పరారయ్యారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.

నిర్మానుష్య ప్రాంతాలపై దృష్టి

పట్టణంలో రద్దీగా లేకుండా ఉండి, నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలపై చైన్‌స్నాచర్స్ దృష్టి పెడుతున్నారు. ఆ ప్రాంతంలో ఒంటరిగా వెళ్లే మహిళలను కొంత దూరం అనుసరించడం, అదనుచూసి బంగారు గొలుసులు లాక్కెళ్లడం జరుగుతోంది. గతంలో నూనివారిపల్లె, ఆర్‌ఎస్‌ఎస్‌రోడ్డుతోపాటు మహిళలు అధికంగా వచ్చే మార్కెట్ ఏరియా, బంగారు దుకాణాలు ఉండే బండ్రాళ్ల వీధి తదితర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తుంటారు. మహిళలు అప్రమత్తంగా ఉండకపోతే.. మెడలోని బంగారుగొలుసులు కోల్పోవాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

కొండాపురం : మండల పరిధి లావనూరు-చెన్నమనేనిపల్లె గ్రామాలకు వెళ్లే రోడ్డులోని ఓ కల్వర్టు వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హత్యా.. ఆత్మహత్యా.. అనే విషయం పోలీసులు తేల్చాల్సి ఉంది. స్థానికులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు గ్రామానికి చెందిన చిన్నగుల్లి ఓబన్నగారి బాలయ్య పెద్దకుమారుడు చిన్నగుల్లి ఓబన్నగారి సురేష్(36) మంగవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు చిలమకూరు గ్రామానికి చెందిన వీరకుమారితో 10 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరకుమారి ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. వీరికి ఇద్దరు సంతానం. సురేష్ ఆటో నడుపుకొంటూ ఎల్లనూరులోనే నివాసం ఉంటున్నారు. సురేష్, వీరకుమారికి మనస్పర్థలు ఉన్నాయి. ఏడాది నుంచి వారు దూరంగా ఉంటున్నారు. కొండాపురం ఎస్‌ఐ విద్యాసాగర్ సురేష్ మృతదేహం వద్దకు చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వాగ్వాదం

షర్మిల జన్మదిన వేడుకల్లో డీసీసీ, నగర అధ్యక్షుల మధ్య వివాదం



పార్టీ కార్యాలయం నుంచి వెళ్లిపోతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ మధ్య మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదినం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసేందుకు అఫ్జల్‌ఖాన్ ఏర్పాట్లు చేశారు. అప్పటికే నగరంలోని అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ బండి జకరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆ కార్యక్రమాలు ముగించుకొని పార్టీ కార్యాలయానికి చేరుకోగానే.. నగర అధ్యక్షుడు కేక్ కట్ చేసేందుకు పిలిచారు. తనకు ముందస్తు సమాచారం లేకుండా.. ఎలా కేక్ కట్ చేస్తానంటూ విజయజ్యోతి మండి పడ్డారు. డీసీసీ అధ్యక్షురాలు మహిళ అని కూడా చూడకుండా, గౌరవంగా పిలవకపోవడం ఏమిటని వాగ్వాదానికి దిగారు. అక్కడ వివాదం నెలకొనడంతో ఆమె వెళ్లిపోయారు. ఈ విషయంపై డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్‌కు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో సంబంధం లేదని అన్నారు. తనకు సమాచారం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి వస్తుందన్నారు. నగర అధ్యక్షుడి తీరుపై అధిష్టానికి ఫిర్యాదు చేస్తామన్నారు. తనకు, పార్టీ కార్యాలయానికి సంబంధం ఉందో లేదో అధిష్టానం తెలుస్తుందని నగర అధ్యక్షుడు చెబుతున్నారు.

గురుకుల ఉపాధ్యాయుల నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న గిరిజన గురుకుల ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : గిరిజన గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఆ ఉపాధ్యాయుల అసోసియేషన్ నేతలు శ్రీనివాసులునాయక్, మహాదేవ్, సరోజ, హరిత మంగళవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కాంట్రాక్టు టీచర్స్‌గా మార్పు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. వారి దీక్షలకు అంగన్‌వాడీ కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సిద్దమ్మ, అరుణ, సునీత, రమీజా, సురేఖతోపాటు ఉపాధ్యాయులు విజయకుమారి, స్వర్ణ, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, ప్రదీప్, సౌజన్య, కాదంబరి, గీత, సుధాకర్, సమిత, ప్రకాష్, వనిత, త్రివేణి, కల్పన, సుభాషిణి, సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వీఆర్‌ఓకు గాయాలు

మదనపల్లె : ట్రాక్టర్ ఢీకొని వీఆర్‌ఓ గాయపడిన సంఘటన మంగళవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం దిగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన రాజగోపాల్(53) కురబలకోట మండలంలో వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం విధులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా, నిమ్మనపల్లె-మదనపల్లె మార్గంలోని వశిష్ట స్కూల్ వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో రాజగోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో ఎడమ కాలు విరిగింది. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

పోలీస్ శాఖలో ఎస్‌బీ కీలకం



ఎస్‌బీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : పోలీస్ శాఖలో స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) విభాగం కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. మంగళవారం రాయచోటిలోని జిల్లా పోలీసు సమావేశ మందిరంలో జిల్లాలోని స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారం వచ్చేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ఇంకా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌లు పి.రాజ, రమేష్, ఏ సత్యనారాయణ, కె. రాజారెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



కొత్త విద్యుత్ స్తంభం

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట : స్థానిక బలిజవీధిలో విద్యుత్ స్తంభం కూలిపోతుంటే తాడుతో నిలిపారు. దీనిపై ‘విద్యుత్ స్తంభాన్ని తాడుతో నిలిపారు’ అనే శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. డిస్కం అధికారులు ఆగమేఘాలపై స్పందించారు. డిస్కం ఏఈ గిరిబాబు, లైన్‌మ్యాన్ లక్ష్మినారాయణ, సిబ్బంది పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త దాన్ని ఏర్పాటు చేయించారు. అలాగే ఇంతకు మునుపు విద్యుత్ తీగలు కిందకు వాలిపోయేవి. ఇప్పుడా పరిస్థితి లేకుండా తీగలు ఎత్తులో ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

సురక్షిత విధానాలతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్ ప్రమాదాల నివారణకు సురక్షిత విధానాలు అనుసరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ అన్నారు. భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారు ‘కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ’పై విద్యుత్ సిబ్బందికి రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు ఎదుర్కోవడానికి తక్షణమే స్పందించి చర్యలు తీసుకునేలా సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యుత్ భద్రత విధానాలు, ప్రమాద నివారణ పద్ధతులు, అగ్ని ప్రమాదాలపై లోతైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. అధిక శాతం ప్రమాదాలు విపత్తుల వల్ల సంభవిస్తున్నాయని, బాధితులకు సాయం చేయడానికి ప్రథమ చికిత్స పద్ధతులు తెలుసుకోవాలన్నారు. వరదలు, తుపానులు వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి సంసిద్ధత గురించి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, యన్‌పీటీఐ డైరెక్టర్ కె.ముత్తుకుమార్, డీఈఈ క్రిష్ణదేవ, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఏపీపీఎస్సీ’ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు





కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి యం.విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై డీఆర్వో ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు జి.అశోక్ (అసిస్టెంట్ సెక్రటరీ, మానిటర్), యస్.కె. కాశింవల్లి (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)తో కలిసి పరీక్షల విధులు కేటాయించిన లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పరీక్షలు ఈ నెల 18 నుంచి 23 వరకు రెండు సెషన్లలో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని కడప నగర పరిధిలో 1, చింతకొమ్మదిన్నె మండలంలో 3, ప్రొద్దుటూరు మండల పరిధిలో 1 పరీక్షా కేంద్రలతో కలిపి మొత్తం 5 కేంద్రాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు, లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే ఇసుక డంప్‌లు ఖాళీ

ఒక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు



సీజ్ చేసిన ఇసుక డంప్ వద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ, మర్రిపాడు గ్రామాల పరిధిలో ఉన్న రామానాయిని చెరువు, హరిహరాదుల చెరువు పరిసరాల్లో ఉన్న ఇసుక డంప్‌లను రాత్రికి రాత్రే ఇసుకాసురులు ఖాళీ చేశారు. కాగా ఒక చోట సగం ఉన్న ఇసుక డంప్‌ను పోలీస్, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ‘సాక్షి’ల ప్రచురితమైన ‘పగలు తోడేస్తూ.. రాత్రిళ్లు తోలేస్తూ’ అనే కథనంపై అధికారులు స్పందించారు. మంగళవారం రామానాయిని చెరువు పరిసరాల్లోని రుద్రావాండ్లపల్లె, పిల్లగోవులవారిపల్లె, చెరువుమొరవపల్లె, రేగడపల్లె, కొత్తపల్లె గ్రామాల సమీప పొలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లపై పోలీస్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. అయితే ఇసుకాసురులు రాత్రికి రాత్రే ఇసుక డంప్‌లను ఖాళీ చేసేశారు. ఆయా గ్రామాల పరిధిలో సుమారు పది చోట్ల ఉన్న ఇసుక డంప్‌లను వారు సోమవారం రాత్రే జేసీబీలతో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా బయట ప్రాంతాలకు తరలించేశారు. ఉదయం అధికారులు దాడులు నిర్వహించే సమయానికే డంప్‌లు ఖాళీ చేసేశారు. మంగళవారం ఉదయం హెడ్‌కానిస్టేబుల్ రమణ, వీఆర్వో నారాయణ తమ సిబ్బందితో కలసి డంప్‌లపై దాడులు నిర్వహించారు. పలుచోట్ల అప్పటికే ఖాళీ చేసిన ఇసుక డంప్‌లను గుర్తించారు. రుద్రావాండ్లపల్లెలో మాత్రం సగం ఖాళీ చేసిన ఇసుక డంప్‌ను గుర్తించి అందులోని నాలుగు ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు సదరు ఇసుకను ఎవరూ కూడా వినియోగించకూడదంటూ తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మృతి చెందిన విజయనిర్మల

బి.కొత్తకోట : మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన విజయనిర్మల (34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుడ్లవారిపల్లెకు చెందిన జనార్దన్ భార్య విజయనిర్మల సోమవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తున్నారు. రాత్రివేళ నిద్రలేచి చూడగా.. అపస్మారక స్థితిలో ఉండటం గమనించి కుటుంబీకులు మంగళవారం తెల్లవారుజామున మూడు గంటలకు బి.కొత్తకోట సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు విజయనిర్మల అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో విజయనిర్మల తమ్ముడు హరీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యనా, ఆత్మహత్యనా తేల్చేందుకు వారు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవి

రైల్వేకోడూరు అర్బన్ : బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ తులసీ, సిబ్బందితో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేకోడూరు పరిధిలో బెల్టు షాపులు నిర్వహిస్తే ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. మొదటిసారి దొరికితే కఠిన చర్యలు, రెండోసారి దొరికితే నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ జహీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఆశాజ్యోతి ‘నకారా’



మాట్లాడుతున్న కడప జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వరావు



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

కడప ఎడ్యుకేషన్ : పెన్షనర్ల పాలిట ఆశాజ్యోతి నకారా గారి అవిరళ అని కడప జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వరావు అన్నారు. మంగళవారం కడప జిల్లా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నకారా కృషి ఫలితమే నేడు విశ్రాంత ఉద్యోగులు పొందుతున్న పింఛన్ విధానమన్నారు. ఆయనను ప్రతి ఒక్క పెన్షనర్ గుర్తుంచుకోవాలన్నారు. ఉప ఖజానా అధికారి రవికుమార్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు జాతి నిర్మాణ సారధులని, వారి అనుభవం అపారమైనదని అన్నారు. వారి సూచనలు ఆచరిస్తే ఏ దేశమైనా అభివృద్ధి పథంలో రాణిస్తుందన్నారు. కడప జిల్లాలోని పెన్షనర్స్‌కు ఎలాంటి సమస్యలు లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, వికలాంగుల, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ కడప పెన్షనర్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అమోఘమన్నారు. వారి న్యాయమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తమ వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా ఎన్‌జీఓల సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, పెన్షనర్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మాట్లాడుతూ 1982 డిసెంబర్ 17న జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పు వల్ల నేడు విశ్రాంత ఉద్యోగులు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల ఎల్లారెడ్డి జాతీయ పెన్షనర్ల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. 30 ఏళ్లుగా సంఘ అభివృద్ధి, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, రాధాకృష్ణ, నగేష్, నారాయణ తెలిపారు. అనంతరం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న 46 మంది పెన్షనర్స్ ను సన్మానించారు. అనంతరం ముద్ర డ్యాన్స్ స్కూల్ చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు గానుగపెంట హనుమంతరావు, యోగా మాస్టర్ చలపతి గౌడ్, నారాయణ, సుబ్బారెడ్డి, నాగయ్య, మల్లయ్య, దేవరాజ్, సుభాన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మస్తాన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.